# కారుణ్యమూర్తి

యమదూతలాగ ఆ పోలీసువాడు ఆ పేటలో వున్న ఒక్కొక్క ఇంటిముందు ఆగి అదే ప్రశ్న అడిగాడు; అడిగినప్పుడు అతని గుండె, దేహం ఎలా పరితపించాయో, ఆ భగవంతుడికే తెలుసు. “అమ్మా, మీ ఇంట్లో ఎవరైనా అబ్బాయి - పదేళ్ళ పిల్లవాడు - ఖాకీ నిజారు, తెల్ల చొక్కాయితో - ఉన్నాడా?” అని అడుగుతూనే పెనుగులాడాడు. ఒక ఇంటి వసారాలో బట్టలు ఆరబెడుతున్న స్త్రీని చూడగానే చర్రున కళ్ళనీళ్ళు తిరిగాయి. ఆమె “అవును, ఉన్నాడు. మీరెందుకు అడుగుతున్నారు? ఒరేయ్, ఇక్కడికి రా!” అని పిలవగానే లోపలినుంచి ఒక పిల్లవాడు పరుగెత్తుకొని వచ్చాడు; పోలీసువాడిని చూడగానే “నేను రాను, పో!” అని భయపడి లోపల దాంకున్నాడు. “ఎందుకురా నీకు భయం? అతసేం చెయ్యరు!” అని పిల్లవాడిని బయటకి రమ్మని ఆ తల్లి మళ్లీ పిలిచింది.

పోలీసువాడు ఒక నిట్టూర్పు వదిలాడు: “వొద్దమ్మా, పిలవకండి. అబ్బాయి అలాగే ఉండనీ! ఆ ఓవర్ బ్రిడ్జ్ దగ్గర లారీలో చిక్కుకొని ఒక పిల్లవాడు పోయాడు! బుర్ర అలాగే చెదిరిపోయిందమ్మా, ఎంత ఘోరం!” మరేం అనడానికి అతని నోరు పెగల్లేదు. తన పాపిష్టి కన్నులు చూసిన ఆ దృశ్యం గుర్తుకి రాగానే అతని ఒడలు మళ్ళీ వణికింది. “అయ్యో, దేవుడా? తరువాత ఏమైంది?” అని ఆ స్త్రీ అడిగింది. జవాబుగా ఇంకొక నిట్టూర్పు వదిలేసి పోలీసువాడు అక్కడనుంచి కదిలాడు. “ఈ పేటలోని పిల్లవాడనే చెప్పారు . . . అమ్మా, పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోండి . . . ” అని చెప్పి, పక్కనే ఉన్న మరొక ఇంటిముందు నిలబడి అదే ప్రశ్నతో, “అమ్మా, మీ ఇంట్లో ఎవరైనా అబ్బాయి - పదేళ్ళ పిల్లవాడు . . . ” అని మొదలుబెట్టాడు. “మా ఇంట్లో అబ్బాయిలెవరూ లేరే?” అని ఆక్కడ ఉన్న స్త్రీ అతనికి చెప్పింది.

“అమ్మా, నువ్వు పుణ్యాత్మురాలువి!” అని సంతానం లేని ఆ స్త్రీని పోలీసువాడు గర్వంతో మెచ్చుకున్నాడు; ఇక కని, పెంచి, పోషించి, ఇప్పుడు దురదృష్టవశంగా తన కొడుకుని పోగొట్టుకున్న ఇంకొక ‘పాపిష్టి తల్లిని’ గుర్తు

చేసుకున్నాడు; ఒక్కొక్క ఇంటిముందు నిలబడినప్పుడు 'దేవుడా, ఈ ఇంట్లోని పిల్లవాడికి  ఆ దుర్ఘటన జరిగివుండకూడదు!' అని వేడుకున్నాడు. ఏ యువతిని చూసినా 'ఈమె ఆ పిల్లవాడి తల్లిగా ఉండకూడదు!' అని అతని హృదయం తపించిపోయింది. కాని ఈ పేటలో, ఏదో ఒక ఇంట్లో, ఒక తల్లి హృదయంలో ఆ 'బాంబు' పేలడం తప్పకుండా జరుగబోతుందనే సూచన గుర్తుకి రాగానే అతను కొంచెం వెనుకాడాడు; మరేం చెయ్యక అలాగే తిరిగి పోవాలనికూడా ఆ పోలీసువాడు ఆలోచించాడు.  'ఆ ఘోర దృశ్యం - ఆ తల్లి పడే బాధ నేను భరించలేను!" అనే అవగాహనలో, ఆ కల్పనతోనే అతని మొహంకి చెమటపట్టేసింది; నాలిక ఎండిపోయింది. అలసటతో పోలీసువాడు ఒక ఇంటి వసారాలో కూర్చొని, టోపీ తీసి, రుమాలుతో, తన మొహం, మెడ తుడుచుకున్నాడు;  'అవును, ఈ విచారణ వద్దు! మనం తిరిగి వెళ్ళిపోతే మరేం బాధా ఉండదు!'  అని మళ్ళీ ఆలోచించాడు.

'కాని . . . నేనలా వెళ్ళిపోతే ఆ పిల్లవాడిని ఒక తల్లి పోగొట్టుకుంది అనే  నిజం అబద్ధమౌతుందా? దేవుడా, ఆ పిల్లవాడి తల్లి ఇప్పుడు లేదంటే ఎంత బాగున్ను! పదిమాసాలు మోసి కన్న బిడ్డని  ఇలాగ క్రూరంగా ఆ భగవంతుడు పీక్కోనడం చూసి ఎవరు భరించగలరు? ఛీ!, ఛీ!, దేవుడు ప్రాణం పోస్తున్నాడు! ఆ యముడు ప్రాణం తీసుకొని పోతున్నాడు; ఐతే ఆ యముడ్ని సృష్టించినది ఎవరు? అదీ ఆ దేవుడే కదా! ఈ దుర్ఘటనికి దేవుడెలా సమ్మతించాడు? తనే బిడ్డని పదిమాసాలు మోసివుంటేనే దేవుడికి ఇది అర్థమౌతుంది . . . పాపం, ఆ కన్నతల్లి! . . . మనిషి చావడం ఏం పెద్ద సంగతి కాదు, కాని అది చూసి ఇతరులు అల్లాడిపోతున్నారే, అదే పెద్ద ఘోరం!  దేవుడా! 'ఈ ఊరులో ఎన్ని ఇళ్ళల్లో గుంపులు గుంపులుగా పిల్లలున్నారు, ఒకడు పోతే ఏం నష్టం?' అని మనం ఊరుకోగలమా? తప్పు, తప్పు! నాకు పిల్లలు లేరు, పుత్ర వాత్సల్యం అంటే ఏమిటో నాకు తెలీదు, కాని నేనుకూడా ఈ ప్రమాదం తాళలేక అంగలార్చుకుంటున్నాను, మరి ఆ తల్లికి ఎలాగుంటుంది? ఒక క్షణంలో దాని ప్రాణ పోతుందేమో? దేవుడా, ప్రాణం అని ఒకటి సృష్టించినప్పుడు ఆత్మీయత అనే భావనకూడా ఎందుకు సృష్టించావ్? కొంచెం సేపు

ముందు పిచ్చికలాగ ఆ పిల్లవాడు ఎలాగ హాయిగా ఎగురుతూ వచ్చాడు! . . . చెయిలో ఒక ఐస్ క్రీము పుల్లతో పరుగెత్తుకొని రావడం నేను చూసాను . . .

నాదొక పాపిష్టి జన్మ . . . ఆ ఘోరం జరుగుతుందని నాకు తెలుసు . . . నాకు మరేం చేతకాదన్నట్టు నా చేతులు, కాళ్ళు పని చెయ్యలేదు! కళ్ళుమాత్రం ఆ ఘోరం చూస్తున్నాయి; పిల్లవాడు ఏడ్చాడా? లేదే? అంతలోనే వాడి ప్రాణం పోయిందే! ఆ పోయిన ప్రాణం ఐస్ క్రీము కావలని తొందరపడింది! అవును, చావులో మనకి కనిపించే ఘోరం అదే కదా? గభీమని వచ్చి అది మన అల్ప ఆశని పెద్దదిగా చేసి మోసం చేస్తుంది! 'ఇంకా కొంచెం టైముందిలే!' అని చావు హెచ్చరిక చేస్తే మనిషి సంతోషంగా చస్తాడేమో, కాని ఈ పెధవ చావు భరించగలదా? చావని వచ్చినప్పుడు అందరికీ ఆఖరికి మిగిలేది నిరాశే కాబోలు! అవును, బతికున్నప్పుడు ఏది అనుభవించినా సరే, చావులో అనుభవించేది నిరాశ మాత్రమే! ఛీ!, ఛీ!, ఇదేం బతుకు!. . .'

'అవాళ స్టేషన్ లో నేను చూసానుగా? పక్కనే మా ఇనస్పెక్టరు కూడా ఉన్నారు . . . ఎక్కడనుంచో ఒక ఒక మగ పిచ్చుక ఎగురుతూ వచ్చి ఆడ పిచ్చుకని తాకింది. ఆ ఆడ పిచ్చు మగ పిచ్చుకని ఉత్తికే ఏడిపింటాలని కీచుకీచుమంటూ ఎదుటనున్న గోడమీదకి దూకి, అక్కడ ఒక ద్వారంలో కూర్చొని మగపిచ్చుకని చూస్తూ ఎగతాళి చేస్తోంది; నిరాశతో ఆ మగ పిచ్చుక గుండె కొట్టుకుంటోంది . . .

ఒకసారి తన రెక్కలని దులుపుకొని మగ పిచ్చుక ఆడపిచ్చుకని తేరిపార చూసింది. అంతే, ఆ చూపుతో ఆడపిచ్చుక మనసు మారిపోయింది, కాని అది కదలకుండా అక్కడే కూర్చోంది. మగ పిచ్చుక తటాలున ఒక దూకు దూకింది. నేనూ, ఇనస్పెక్టరూ ఇక ఏం జరుగుతుందని చూడాలని తలతిప్పి చూసాం. ఇనస్పెక్టరు నన్ను చూసి నవ్వుతూ కన్నుకొట్టారు. "దానికేంలెండి, ప్రకృతిలో ఇది అందరికీ సహజమేకదా?" అని చెప్పి నేను నోరింకా మూయలేదు, అంతలోనే, కీచుమని ఒక పెద్ద శబ్దం! ఆ మగ పిచ్చుక నా కాలుముందు వాలింది. దాని తలనిండా ఒకటే రక్తం! 'దేవుడా!' అని గోల పెడుతూ నేను తలెత్తి చూసాను; చావుకి తోడుగా ఆ ఫేన్ కూడా వేగంగా తిరుగుతోంది! ఇనస్పెక్టరు పరుగెత్తుకొని

వచ్చి దాన్ని చేతులోకి తీసుకున్నారు. "చూసావా, ఇది పోయింది! నువ్వు చెప్పావుగా ప్రకృతిలో ఇది సహజం అని? నువ్వన్నది చావు గురించి. అవునా?" అని అంటూ కిటికీ ద్వారా దాన్ని బయటకి పారేసారు.

ఆ మగ పిచ్చుక దెబ్బ తగిలి చావడం ఏం పెద్ద సంగతి కాదు, ఆ ఆడ పిచ్చుక - ఏదో ఎదురు చూసి - బాధ పడిన ఘోరం ఉందే? . . . రామ!, రామ! అప్పుడే నాకనిపించింది, దేవుడు దయా, దాక్షిణ్యం లేని ఒక ఖూనీకోరు అని. జాలి, దయా లేక, చిత్రహింసని చూసి ఆనందించే క్రూరమైన మనసు వాడికుంది . . . చావు అని ప్రకృతిలో ఉన్నప్పుడు, దానికి విరుద్ధంగా ఆత్మీయత ఎందుకు? ఆ పిల్లవాడు గారాబంగా కొన్న ఐస్ క్రీము రుచి చూడడానికి ముందే ఎందుకలా చావాలి? ఎందుకు అంత తొందర? ఎంత ఘోరం! ఐస్ క్రీము కరిగే ముందే వాడి ప్రాణం పోయింది! ఎందుకు? అదే నేను ఆ దేవుడ్ని అడుగుతున్నాను . . .'

మనసు అలా అల్లాడిపోతూ పోలీసువాడు ఆ ఇంటి వసారామీద చాలాసేపు కూర్చున్న తరువాత, ఒక నిట్టూర్పు వదిలి లేచాడు. నేలమీద ఉంచిన తన టోపీని తీసుకొని తలమీద పెట్టుకొని తిరిగి చూసినప్పుడు అతని చూపు ఆ ఇంటిలో ఒక తల్లి - యువతి - బిడ్డకి పాలిస్తూ కనిపించింది; అదొక అద్భుతమైన దృశ్యం అనాలి.

"అమ్మా, తాగడానికి నీళ్ళు ఇస్తావా?" అని అడుగుతూ పోలీసువాడు మళ్ళీ వసారాలో కూర్చున్నాడు. యువతి బిడ్డని ఛాతీతో అదుముకొని, లేచి, లోపలికి వెళ్ళి, ఒక చెంబులో నీళ్ళు తెచ్చింది. ఆ బిడ్డ తల్లి రొమ్ములోనుంచి పాలు పీల్చే శబ్దం వినిపిస్తూనేవుంది. పోలీసువాడు చెంబుని అందుకున్న తరువాత యువతి మాతృక స్వభావంతో బిడ్డ జుత్తుని మృదువుగా తాకింది. గభీమని పోలీసువాడి కళ్లు బెదిరాయి: 'ఒక వేళ ఈ యువతి ఆ పిల్లవాడి తల్లేమో? ఛీ, ఛీ, ఈమె వయసులో చిన్నదిగా కనిపిస్తోందే?' అని అతనికి అనుమానం కలిగింది. "ఏమ్మా, ఇదేనా నీకున్న ఒకే సంతానం?" అని అడిగాడు. "లేదు. వీడికో అన్నయ్య ఉన్నాడు. ఆ తరువాత ఇద్దరు పిల్లలు పుట్టారు, పోయారు. వీడు నాలుగవ బిడ్డ." "ఆ పెద్దవాడు ఎక్కడమ్మా?" "వాడు స్కూలుకి వెళ్ళాడు." "స్కూలుకా? ఎలాంటి దుస్తులుతో వెళ్ళాడు?" "స్కూలుకి ఖాకీ నిజారు, తెల్ల చొక్కాయితో రావాలని

బలవంతం చేస్తున్నారని నా ప్రాణం తీసి, ఆఖరికి నిన్న కుట్టి ఇచ్చినతరువాత ఇవాళ వెళ్ళాడు. అవును, మీరెందుకు ఇవన్నీ అడుగుతున్నారు?" పోలీసువాడు ఒక నిమిషం మౌనం వహించి, మామూలుగా మాటాడుతున్నట్టు మళ్ళీ అడిగాడు: "పిల్లవాడు స్కూలుకి ఆ ఓవర్ బ్రిడ్జ్ దాటి వెళ్ళాలా?" "లేదు. స్కూలు దానికి ముందే ఉంది. కాని వీడు ఊరంతా తిరుగుతాడు; వీడి అల్లరితనం బాగా పెరిగిపోయింది! చెప్పితే వినడు! ఇవాళ పొద్దున్నే ఐస్ క్రీముకోసం అర్ధణా కావాలని మొండిపట్టు పట్టాడు, నేను ఇవ్వనన్నాను. ఆ తరువాత నాకు తెలియకుండా వాడు పెట్టెనుంచి అర్ధణా తీస్తుంటే చూసి పరుగెత్తుకొని వచ్చాను. కాని వాడిలాగ నేను పరుగెత్తగలనా? వాడు చటుక్కున పారిపోయాడు! . . . అబ్బబ్బా, ఏం అల్లరి! నాకు వచ్చిన కోపంతో "వెధవా, పో, పో,  మరి ఇంటికి తిరిగి రాకు!" అని తిట్టాను." పోలీసువాడు ఇప్పుడు జోక్యం చేసుకొని "ఎందుకమ్మా నువ్వలా అన్నావ్? పొరబాటమ్మా . . . " అని తడిసిన తన కళ్ళని దాచుకోవాలని తల వంచాడు. ఒక దగ్గు దగ్గి, తన బాధ్యత తను నిరవేర్చాలని నిశ్చయించుకొని, తలెత్తి, తడిసిన కళ్ళని గట్టిగా భిగించుకొని, విగ్రహంలాగ ఒక నిమిషం నిల్చున్నాడు. అతని హృదయం తుప్పు పట్టిపోయినట్టు, పెదిమలనుంచి గరగరమనే శబ్దంతో మాటలు వచ్చాయి. "ఆ ఓవర్ బ్రిడ్జ్ దగ్గర లారీకింద పడి ఒక పిల్లవాడి ప్రాణం పోయింది. వెళ్లి చూడు, అది నీ పిల్లవాడా అని." "అయ్యో, నా రాసా!" అనే ఆ తల్లి  అరుపు విని ఆ పేట అంతా అదిరిపడింది. ఆ మానసిక అలజడితో పోలీసువాడు మళ్లీ వసారామీద వాలాడు. పాలు తాగుతున్న శిశువుని అదుముకొని, పిచ్చెత్తినట్టు ఆ తల్లి వీధిలోకి దూకింది.  ఇంకా మూడు వీధులు దాటాలనే నిరాశతో, బిడ్డని నటుములో ఇడుముకొని, తెఱచిన తన వక్షస్థలంని లెక్కచెయ్యకుండా ఆమె పరుగెత్తింది.

దుర్ఘటన జరిగిన జాగాలో ఇంతసేపు గుమిగూడివున్న జనులు ఇప్పుడు గుంపులు గుంపులుగా తిరిగివస్తున్నారు. ఎదుట దిశలో తల్లి స్వరూపంలో వస్తున్న ఆ యువతిని చూడగానే, వాళ్లు వెనక్కి తిరిగి ఆమెని వెంబడించారు. గుంపుకి ఏది చూసినా సరదావే! ఏదో వార్తాపత్రికలోని సంగతి తెలుసుకోవాలనే ధోరణిలో  ఎవరో అడిగారు. వెంటనే ఇంకొకతను, నిశ్చింతగా, చెప్పారు: "ఒక

పిల్లవాడు లారీకింద చిక్కుకున్నాడు.” “ఆ తరువాత?” “ఆ తరువాత, మరేం ఉంది, చెప్పడానికి? అక్కడే ప్రాణం పోయింది!” అని ఒక ముష్కరమైన నవ్వుతో జవాబు! “ఈ లారీ డ్రైవర్లకి ఏ చీకూ, చీంతా లేదు! కళ్ళు మూసుకొని నడుపుతారు! వాళ్ళందరిని రహదారిలో పడుకోబెట్టి వాళ్ళమీద లారీ ఎక్కించాలి!” అని మరొకతని తీర్పు! ఎది ఎలాగైనా సరే, నీతిని తప్పకుండా అమలు పరచాలని అతనికి చాలా ఆతురత! ఈ గుంపుకి ఇతరులమీద కోప్పడమంటే చాలా ఇష్టం!

పోలీసువాడు ఆ వీధి చివరనుంచి వస్తున్నాడు. వేగంగా పరుగెత్తి, దొంగని పట్టుకొనే శక్తి అతనికి ఉంది, కాని ఇప్పుడు తన మనోవ్యధవలన అతను వెనక్కి పడిపోయాడు. ఇంతలో యువతి చంటిపిల్లని నడుములో ఎత్తిపెట్టుకొని, ఆఖరి వీధిని దాటి ప్రమాదం జరిగిన చోటు చేరుకున్నప్పుడు, ఆ గుంపు మధ్య ఇంకొక స్త్రీ నేలమీద వాలి, రెండు చేతులూ పైకెత్తి, “దేవుడా, నీకేం కళ్ళు లేవా?” అని బొబ్బలు పెట్టడం చూసింది. వెంటనే ఈ తల్లి ఆగింది; కళ్ళనుంచి ధారలుధారలుగా కన్నీరు కార్చుతూనే, తనలో నవ్వుకుంది.

“అది మన రాసా కాదు! . . . అవును, మన రాసా కాదు!” అని చంటిపిల్లని అణచుకొని ఆ తల్లి నవ్వింది; గుండె మాత్రం ఇంకా శోకంతో తపించుతూనే ఉంది. ఇప్పుడే ఆమె మాతృభావన తీవ్రత తగ్గినట్టు సూచనలు కనిపించాయి. తొందర, తొందరగా గందరగోళంగావున్న చీరని సద్దుకుంటూ తన వక్షస్థలం కప్పుకుంది. పక్కనే నిలబడివున్న పోలీసుని చూసి “ఇది నా పిల్లవాడు కాదండీ, మరెవరో? నా పిల్లవాడు కాదు!” అని కళ్ళు మూసుకొని, రెండు చేతులూ జోడించి, దేవుడికి తన కృతజ్ఞత తెలియజేసింది. ‘ఛీ, ఇంతేనా? మాతృత్వం అంటే? ఇంత అల్పమైన వృత్తంలో ఇరుకైన భావన అన్నమాట!’ అని పోలీసువాడు మొహం ముడుచుకొని ప్రమాదం జరిగిన చోటకి త్వరగా నడిచాడు. అక్కడ గుంపుమధ్య వాపోయే స్త్రీని చూడగానే ఉలిక్కిపడ్డాడు. అది అతని భార్య - బజారుకి వెళ్ళి తిరిగివచ్చే దారిలో - ఆ ఘోరం చూసింది కాబోలు! దాని కూరగాయల సంచి నేలమీద బోర్లపడివుంది, కూరగాయలు చెల్లాచెదరిపోయాయి! ‘నీకెందుకే ఈ గోల?’ అని మూలుగుతూనే పోలీసువాడు కూడా పసిపాపలాగ ఆమెతోబాటు వెక్కివెక్కి ఏడ్చాడు. “తంగం,

ఇదేంటి?" అని అడుగుతూ ఆమెకి ఒక చెయి అందించాడు. భర్తని చూడగానే ఆమె ఇంకా జోరుగా ఏడవసాగింది. " చూసారా, ఇదేం న్యాయం? మీ పోలీసువాళ్లు ఏం చేస్తున్నారు? ఇరవై సంవత్సరాలు మనం పిల్లలు కావాలని తపసు చేస్తున్నాం . . . చూడండి ఈ భయంకరం!" అని ఆమె ఇంకా ఏడుస్తూనే ఉంది.

"తంగం, ఎవరెవరి కర్మ ఎలా ఉందో, ఎవరికి తెలుసు? వాళ్ళకోసం మనం ఏడుస్తే సరైపోతుందా? రా, లేచి రా!" అని పోలీసువాడు ఆమె చెయిని పట్టుకొని, ఆమెని ఎత్తి నిలిపాడు. కాని ఆమె అతని పట్టుని తోసిపారేసి దూరంలో నిలబడింది. ఆమె దృష్టి అంతా ఆ కన్నుమూసిన బిడ్డమీదే ఉంది. "ఇది నా బిడ్డ! అవును, నా బిడ్డ!" అని ప్రలాపించుతూ అక్కడే నిలబడి ఉంది. కన్నుమూసినది తన బిడ్డ అని తెలియక, తన్ను తనే మోసం చేసుకొని అక్కడకి వచ్చిచేరిన యువతిని - ఆ దుర్భాగ్యరాలుని - పోలీసువాడు ఇప్పుడు తేరిపాఱి చూసాడు. పాపం, ఆ తరువాత జరుగబోయే దారుణ దృశ్యం చూసి తను భరించలేనని, తన భార్యా అది చూడకూడదని, ఆమె తనతో ఇంటికి వెళ్ళడానికి చెయి అందించాడు; భార్య మూలుగుతూ, ఏడుస్తూ, కాలు నేలమీద మోపి, లేచి, భర్తతో నడిచింది. గుంపు ఇప్పుడు రెండు భాగాలైంది. ఒక భాగం ఆ పోలీసుదంపతుల శోక నాటకం చూసి ఆనందించాలని వాళ్ళ వెనుకనే నడిచింది.

"గొడ్రాలుగా నాదొక పాపిష్టి జన్మ! కన్ను మూసిన పాపకోసం ఏడవడానికి కూడా నాకు అర్హత లేదా?" అని సణుగ్గుంటూ వాపోయే భార్యని పోలీసువాడు బలవంతంగా లాగ్గొని ఆ వీధి చివరవున్న తన ఇంటికి తీసుకొనివెళ్ళాడు. అప్పుడే, దూరంలో, ప్రమాదం జరిగిన జాగాలో, ఆ బాంబు పేలింది! పోలీసువాడు చెవులు మూసుకున్నాడు. "అయ్యో, నా రాసా!" అని వినిపించిన ఆ దిక్కుమాలిన తల్లి కూత విని ఆ పేట వొణికినప్పుడు పోలీసువాడు తన భార్యని రెండు చేతులతో గుంజుకొని ఇంట్లోకి నడిచాడు.

అతను తన చేతుల్లో మోసినది ఎలా వర్ణించడం? అది అతని భార్య దేహం మాత్రమే కాదు, ఆమెలో వర్ధిల్లే విశ్వజనీన మాతృత్వం అతనికి బరువుగా ఉంది. లోపలికి వెళ్ళగానే భార్యాభర్తలు ఒకరినొకరు కౌగిలించుకొని హోరున ఏడ్చారు.

గభీమని పోలీసువాడు తిరిగిచూసినప్పుడు, ఇంటి ముందూ, కిటికీల దగ్గరా జనులు గుంపులు గుంపులుగా కనిపించారు. ధుమధుమలాడుతూ, లేచి వెళ్ళి, పోలీసువాడు, కిటికీలు సద్దుగా మూసాడు. ఇంటి ముందున్న గుంపు ఇప్పుడు మళ్ళీ ఆ ప్రమాదం జరిగిన చోటుకి పరుగెత్తింది.

అవును, గుంపుకి ఏది చూసినా సరదాపే!

********